# చైతన్య గళం
తెలుగు దిన పత్రిక




సంచిక :148 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి , నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగరం మంగళవారం 2 -7 -2024 వెల : రూ. 5.00

# రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశమంతా ఏకమైంది




- లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం
- బీజేపీని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు
- శివుడి ఫోటో చూపిస్తూ.. శివుడి నుంచి ప్రేరణ పొందా
- దేశమంతా ఏకమై రాజ్యాంగ పరిరోణకు కృషి చేసింది
- నోట్ల రద్దు, జీఎస్టీతో దేశం అతలాకుతలం
- నీట్ పరీక్షల్లో అవతవకలపై ఎందుకు చర్చించరు
- అధికార బిజెపిని ఏకి పారేసిన విపక్షనేత రాహుల్




**న్యూఢిల్లీ, జూలై 1 (చైతన్య గళం):**
లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగంపై రచ్చ రాజుకుంది. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగంతోనే బీజేపీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. శివుడి నుంచి తాను ప్రేరణ పొందానని , శివుడి ఫోటోను రాహుల్ గాంధీ లోక్‌సభలో చూపించారు. అయితే స్పీకర్ అభ్యంతరం తెలిపారు. శివుడి ఫోటోను చూపిస్తే -మిగతా 2 లో



## హైకోర్టులో కెసిఆర్‌కు చుక్కెదురు

- విద్యుత్ విచారణ కమిషన్ రద్దు పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్,
తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. విద్యుత్ విచారణపై వేసిన కమిషన్ ను రద్దు చేయాటంలూ కేసీఆర్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ -మిగతా 2 లో



## ఢిల్లీలో తొలి కేసు నమోదు

- అమల్లోకి వచ్చిన కొత్త న్యాయవ్యవస్థ

న్యూఢిల్లీ,
భారత న్యాయవ్యవస్థలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత కింద తొలి కేసు నమోదైంది. న్యూదిల్లీ రైల్వే స్టేషన్ పరిధిలోని ఓ -మిగతా 2 లో



## విపత్తుల నిర్వహణ ఇక హైడ్రాగా మార్పు

- విభాగానికి కీలక బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం
- పరిధిని అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరణ
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 1 (చైతన్య గళం):**
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో -మిగతా 2 లో



## ఎమ్మెల్యే పల్లా అరెస్ట్

హైదరాబాద్,
భారాసకు చెందిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అరెస్ట్ అయ్యారు. నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆసుపత్రిలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ -మిగతా 2 లో

## జగిత్యాలకు శని వదిలింది

- ఎంగిలిమెతుకుల కోసం సంజయ్ ఎగిరి పోయిండు
- కవిత సమా అనేకమంది ఆయనను లీడర్ చేసిండ్రు
- జీవన్ రెడ్డి కూడా చేరికలను ఆహ్వానించడం లేదు
- దమ్ముంటే ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- గతంలో మేము బాజాప్తా పార్టీని విలీనం చేయించాం
- జగిత్యాల బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్



**జగిత్యాల,జూలై 1 (చైతన్య గళం):**
గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చురకలంటించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగిత్యాలకు పట్టిన శని పోయిందని ఈ నియోజకవర్గ ప్రజలు ఉత్సాహంగా ఉన్నట్లు -మిగతా 2 లో

## ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరుస్తాం

- బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయిస్తాం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



2

## ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం



- కొత్త ప్రభుత్వంలో పెన్షన్లతో కార్యక్రమాలకు శ్రీకారం
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పనిచేస్తున్నాం
- పెనుమాకలో పెన్షన్ల పంపిణీ చేపట్టిన సిఎం చంద్రబాబు

**అమరావతి,.జూలై 1 (చైతన్య గళం):**
ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు. వారి జీవన ప్రమాణాల పెంపునకు మొదటి అడుగుపడిందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సోమవారం ఉదయమే ఆన -మిగతా 2 లో



## గవర్నర్ తో సిఎం రేవంత్ భేటీ

- కేబినేట్ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలపై ఊహాగానాలు
- నామినేటెడ్ ఎమ్మెల్సీలపైనైఆ చర్చించి ఉంటారని టాక్

హైదరాబాద్,
రాష్ట్ర కేబినెట్ ను విస్తరించొచ్చు నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ సి.పి. -మిగతా 2 లో

# రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశమంతా ఏకమైంది

(మొదటి తరువాయి)

తప్పవుతుందా..? అని రాహుల్ ప్రశ్నించారు. శివుడు శాంతికి ప్రతీక, హింసకు వ్యతిరేకమని.. బీజేపీ హిందువులకు వ్యతిరేకమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు రాహుల్. భగవాన్ శివుడి నుంచి తాను ప్రేరణ పొందినట్టు తెలిపారు. దేశమంతా ఏకమై రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపేర్కొన్నారు. భారత్ అనే భావన, రాజ్యాంగంతోపాటు భాజపా ఆలోచనలను ప్రతిఘటించిన లక్షలాదిమందిపై గత పదేళ్లలో క్రమపద్ధతిలో దాడి జరిగిందని ఆరోపించారు. తానూ బాధితుడినేనని.. తనపై 20కిపైగా కేసులు మోపారన్నారు. నాకు రెండేళ్ల జైలుశిక్ష పడింది. నా ఇల్లు తీసేసుకున్నారు. ఈడీ ఆధ్వర్యంలో 55 గంటల పాటు విచారణ ఎదుర్కొన్నా అని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చలో భాగంగా రాహుల్ ప్రసంగించారు. ప్రతిపక్షంలో ఉండటం గర్వంగా, సంతోషంగా ఉందని పేర్కొంటూ.. అధికారంలో కంటే ఇదే ఎక్కువ విలువైనదని, ఇందులో 'సత్యం' ఉందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతుండగా ప్రధాని సహా భాజపా ఎంపీలు పదే పదే అభ్యంతరం తెలపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, భాజపాపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ.. సభలో కొన్ని ఫొటోలను చూపించారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. సభలో ఇలాంటి మతపరమైన ఫొటోల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించవని స్పీకర్ ఓం బిర్లా వారించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలగజేసుకుని రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. హిందువులను హింసావాదులుగా రాహుల్ పేర్కొనడం ఆమోదనీయం కాదని దుయ్యబట్టారు. అటు కేంద్ర మంత్రి అమిత్ షా సైతం విపక్ష నేత క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు కారకులైన వారికి.. అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. అయితే.. తాను భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశానని.. ఆ పార్టీ, ఆర్ఎస్ఎస్‌లే మొత్తం హిందూ సమాజం కాదని రాహుల్ తెలిపారు. అన్ని మతాలు ధైర్యం, నిర్భయత, అహింస సందేశాలను చాటి చెబుతున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, అగ్నివీర్‌ల ప్రస్తావన లేదు. ప్రొఫెషనల్ పరీక్ష అయిన 'నీట్'ను కమర్షియల్‌గా మార్చారు. గతంలో తీసుకొచ్చిన రైతు చట్టాల వల్ల 700 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. వారికి సంతాపంగా సభలో మౌనం కూడా పాటించలేదు. భాజపా హయాంలో సంస్థలు నిర్వీర్యమయ్యాయి. దేవుడితో ప్రత్యక్షంగా మాట్లాడతానని స్వయంగా ప్రధాని చెప్పారు. భాజపా ప్రభుత్వం.. జమ్మూకశ్మీర్‌ను రెండు ముక్కలు చేసింది. అల్లర్లతో మణిపుర్ అట్టుడికి పోయినా.. ఇప్పటివరకు ప్రధాని వెళ్లలేదు. అక్కడ నా కళ్లముందే పిల్లలపై బుల్లెట్ల వర్షం కురిసింది. నోట్ల రద్దు వల్ల యువత ఉపాధి కోల్పోయింది. జీఎస్టీ వల్ల వ్యాపారులు, ప్రజలు అనేక బాధలు పడ్డారు. వీటి వల్ల దేశప్రజలకు కలిగిన లాభం ఏంటని విపక్షనేత రాహుల్ ప్రశ్నించారు. హిందుత్వ పేరుతో దేశ ప్రజలను బీజేపీ భయపెడుతోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ మణిపూర్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో అంతర్యుద్ధం జరుగుతుందన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గాలికొదిలేశారని పేర్కొన్నారు. బడా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్నారని ఫైర్ అయ్యారు. తాను దేవుడితో నేరుగా మాట్లాడతానని మోదీ చెప్పారు.. నోట్ల రద్దు చేయాలని దేవుడే మోదీకి చెప్పి ఉంటారంటూ రాహుల్ పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను సర్వనాశనం చేశారని.. ఉద్యోగాలు లేక యువత అల్లాడుతోందన్నారు. అగ్నివీర్ పథకంపై తీవ్ర విమర్శలు చేశారు. అగ్నివీర్ జవాన్లు యుద్ధంలో చనిపోతే అమర జవాన్ హోదా లభించదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ సారి గుజరాత్ లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని.. రాసిపెట్టుకోండంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# విపత్తుల నిర్వహణ ఇక హైడ్రాగా మార్పు

(మొదటి తరువాయి)

సోమవారం సాయంత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఎండీఏ, మూసీ డెవలప్మెంట్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ భౌగోళిక పరిధిని విస్తరించనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. డీఐజీ స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్గా, ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని సీఎం చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక టీమ్లు ఈ విభాగంలో నియమించాలని సూచించారు. కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలు అందించేలా పునర్వవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటిలో హైడ్రా క్రియాశీలంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దాదాపు రెండు వేల కిలోమీటర్ల జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న చెర్వులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందిస్తుంది. అందుకు వీలుగా ఈ విభాగం పునర్వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ÷ూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. హైదరాబాద్ సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని ఆయుర్వేద హాస్పిటల్, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరు లాంటి వివిధ చారిత్రక ప్రదేశాలపై జీహెచ్ఎంసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ను ప్రదర్శించింది.

# జగిత్యాలకు శని వదిలింది


(మొదటి తరువాయి)

అనిపిస్తోందని అన్నారు. కొన్ని సందర్భాల్లో కష్టాలు వచ్చినప్పుడు మనషుల విలువ తెలుస్తది. గాలికి గడ్డపారలు కొట్టుకుపోవు. గట్టి నాయకులు కొట్టుకుపోరు. గాలికి కొట్టుకుపోయేది గడ్డిపోచలు మాత్రమే. గడ్డిపారల్లాంటి మీరు వెళ్లలేదు.. ఒక గడ్డిపోచ మాత్రమే కొట్టుకుపోయింది అని ఎమ్మెల్యే సంజయ్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కవితక్కతో సహా వేలమంది కష్టపడితే ఆయన ఎమ్మెల్యే అయిండు. ఇప్పుడు ఆ ఎమ్మెల్యే దొంగల్లో కలిసిండు. రేవంత్ రెడ్డి విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడి పోయిండు. ఎమ్మెల్యే బుద్ధి ఇవాళ తెలిసి వచ్చింది. అభివృద్ధి కోసం పోయినా అని సంజయ్ అన్నాడు. జగిత్యాల జిల్లా రద్దు చేస్తా.. మెడికల్, నర్సింగ్ కాలేజీ రద్దు చేస్తా అని రేవంత్ రెడ్డి అన్నందుకు సంజయ్ కాంగ్రెస్‌లోకి వెళ్లిండా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 4500 డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చినందుకు రద్దు చేయమని పోయావా..? ఏ అభివృద్ధి ఆశించి పోయిండు సంజయ్. ఆయన పోయింది ఒక్కదాని కోసం.. ఇయ్యంకుడి బిల్లులు రావాలి.. ఆయన క్రషర్ ఆగొద్దని పోయిండు. సొంత అభివృద్ధి కోసం పోయిండు.. జగిత్యాల అభివృద్ధి కోసం పోలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ సిగ్గు లేకుండా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ ఆయారాం, గయారాం అనే విషబీజానికి శ్రీకారం చుట్టిందే ఇందిరాగాంధీ హయాంలోని కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. 2004లో మనతో పొత్తు పెట్టుకొని మన 26 మంది ఎమ్మెల్యేలలో 10 మంది ఎమ్మెల్యేలను కలుపుకునే పని చేసిందని అన్నారు. అయినా సరే 2014లో ఇదే కాంగ్రెస్‌తో కొట్లాడి కేసీఆర్ ఆధ్వర్యంలో మనం తెలంగాణ తెచ్చుకున్నామని అన్నారు. 2014లో ఇప్పుడున్న సీఎం రేవంత్ రెడ్డి మన ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసింది మీరంతా చూశారు. తెలంగాణను నడిపియ్యలేకపోతున్నారని చెప్పేందుకు, ప్రభుత్వం స్థిరంగా లేదని సర్కార్ ను పడగొట్టే ప్రయత్నం చేశారు. ఆ పరిస్థితుల్లో రాజ్యాంగ బద్ధంగా మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు మన పార్టీలో చేరారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే విధంగా మనం వ్యవహరించలేదు. అప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరినప్పుడు ఇదే రేవంత్ రెడ్డి వాళ్లను రాళ్లతో కొట్టి చంపాలన్నాడు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరుస్తాం

-బడ్జెట్‌లో నిధుల కేటాయింపు చేయిస్తాం
-అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్,
పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ పథకాని భద్రాచలం రాములవారి సన్నిధిలో ప్రారంభించామని చెప్పారు.



ఈ ఏడాది పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని ఇందుకు అనుగుణంగా వచ్చే బడ్జెట్లో నిధుల కేటాయింపులు కూడా జరుపుతున్నామని వెల్లడించారు. సచివాలయంలో హౌసింగ్ పై ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు మంత్రి పొంగులేటి, మొదటి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్ల చొప్పున 4 లక్షల16 వేల 500 ఇండ్లు, రిజర్వ్ కోట కింద 33 వేల 500 ఇండ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు.

# హైకోర్టులో కెసిఆర్‌కు ఉక్కెదురు

(మొదటి తరువాయి)

విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. దీనిపై విచారించిన కోర్టు సోమవారం కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు రోజుల ముందే వాదనలు ముగిశాయి. అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది.

# ఢిల్లీలో తొలి కేసు నమోదు

(మొదటి తరువాయి)

వీధి వ్యాపారిపై కొత్త క్రిమినల్ కోడ్‌లోని సెక్షన్ 285 కింద పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దేశ రాజధానిలో ఒక వీధి వ్యాపారి రోడ్డుపై వాటర్ బాటిళ్లు, గుట్కా, బీడీ, సిగరెట్లు అమ్మడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. అతడి తాత్కాలిక దుకాణం ఎన్‌డీఆర్ఎస్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కింద ఉంది. దానివల్ల రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దాంతో దానిని వేరేచోటుకు తరలించమని అతడికి పోలీసులు పలుమార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయింది. దానివల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వీడియో తీసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ వీధి వ్యాపారిని బిహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఇంతకుముందు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు.

# ఎమ్మెల్యే పల్లా అరెస్ట్

(మొదటి తరువాయి)

నాయక్‌ను పరామర్శించేందుకు పల్లా వెళ్లారు. ఈ క్రమంలో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. భారాస ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా పలువురిని అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాల్సింది పోయి.. పరామర్శించేందుకు వెళ్తున్నవారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ఇదేనా మీ ప్రజా పాలనా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన నేతలకు నిరుద్యోగుల ఆవేదన ఎందుకు అర్థం కావడం లేదని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని భారాస పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# గవర్నర్ తో సిఎం రేవంత్ భేటీ

(మొదటి తరువాయి)

రాధాకృష్ణన్ సోమవారం కలుసుకున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సిఎం భేటీ అయ్యారు. రానున్న కొన్ని రోజుల్లో కేబినెట్ విస్తరణ ఉండనున్నదన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ముఖ్యమంత్రి గతవారం ఢిల్లీకి వెళ్లి అక్కడ కాంగ్రెస్ ప్రధాన నాయకులతో కేబినెట్ విస్తరణ గురించి చర్చించారని తెలిసింది. ఐదు నుంచి ఆరుగురు మంత్రులను కేబినెట్ లోకి తీసుకోవడం ఖరారయిందని తెలుస్తోంది. మంత్రి పదవులు వస్తాయని చాలా మంది గత ఆరు మాసాలుగా ఎదురుచూస్తున్నారు.రేవంత్ రెడ్డి, ఆయన 11 మంది కేబినెట్ కొలీగులు 2023 డిసెంబర్ 7న ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్రానికి గరిష్ఠంగా 18 మంది మంత్రులు ఉండొచ్చు. ఇదిలావుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నఅసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బిల్లుల గురించి గవర్నర్‌కు వివరించారని తెలుస్తోంది.

# ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

(మొదటి తరువాయి)

నేరుగా పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్దిదారులతో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వంలో మొదటగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. అందరి ఆశీస్సులతో నాలుగోసారి సిఎంగా ప్రమాణం చేశానన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమన్నారు. వారి జీవన ప్రమాణాల పెంపులో మొదటి అడుగు పడిందన్నారు. సమాజమే దేవాలయం అని ప్రజలే దేవుళ్లు అని ఎన్టీఆర్ చెప్పారనీ, ఆయన స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేదలపై శ్రద్ధ పెడతామన్నారు. అనునిత్యం వినూత్నంగా ఆలోచిస్తామన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే తన ఆలోచన అన్నారు. దివ్యాంగులకు పింఛను రూ.6వేలు చేశామని, వారికి చేయూతనివ్వడం సమాజం బాధ్యత. నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు, అధికారులు సచివాలయ సిబ్బందితో పింఛన్ల పింపిణీ తమ వల్ల కాదన్నారు. పంపిణీ చేతకాకపోతే ఇంటికి వెళ్లాలని వారికి ఆనాడే చెప్పానన్నారు. నేడు 1.25 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పంపిణీ జరుగుతోందన్నారు. దీనికి వాలంటీర్ల సహాయం కూడా తీసుకోవాలని చెప్పామన్నారు.

# కెనాల్ల మరమ్మతు పై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

**-సొంత నిధులతో కెనాల్ లో పూడికతీత,చెట్ల తొలగింపు**
**-అన్నదాతల శ్రేయస్సే పరమావధిగా పనిచేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే**



**వనపర్తి జూలై 1 (చైతన్య గళం):** వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పోలికేపహాడ్ మెయిన్ కెనాల్ తోపాటు బుద్ధారం కుడి ఎడమ కాలువల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన మట్టి, కంప చెట్లను తొలగించి పాడైపోయిన బ్యాంకింగ్ ను బాగు చేయించారు.రోడ్ల డైవర్షన్ వద్ద పైప్ లైన్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు.ఈ కెనాల్లను బాగు చేయించడంతో వనపర్తి నియోజకవర్గ పరిధిలోని గోపాల్పేట, వనపర్తి, పెద్దమందడి ఖిల్లా ఘనపురం, మండల పరిధిలోని గ్రామాలకు నిరాటగంగా సాగునీరు అందుతుంది.వర్షభావ పరిస్థితులు, గత ప్రభుత్వ ముందు చూపు లేని బాధ్యత రహిత పనుల వలన రిజర్వాయర్లలో నీరు వృధా అవ్వడంతో అన్నదాతల పంటలకు సరిగా నీరు అందక ఇబ్బంది పడ్డారని అలాంటి పరిస్థితులు భవిష్యత్తులో తలెత్తకుండా ఉండేందుకు ముందుచూపుగా మరమ్మతు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.రైతుల ఇబ్బందుల తెలిసిన వ్యక్తి వనపర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కావడం హర్షించదగ్గ విషయమని రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముందుచూపుగా కెనాల్లా మరమ్మత్తులు చేపట్టడం రైతులకు ఉపయోగకరమని ఆనందం వ్యక్తం చేశారు.గతంలోనూ కేవలం 40 రోజుల్లో బుద్ధారం కెనాల్ పనులను పూర్తి చేసి కృష్ణ జలాలను అన్నదాతలకు అందించిన ఘనత మన ఎమ్మెల్యే దని వారు గుర్తు చేశారు.


# ప్రభుత్వ ఆసుపత్రులోని సమస్యలను పరిష్కరించండి

**-బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము**



**వనపర్తి జులై 1(చైతన్య గళం):** ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ పేరుకు పెద్ద ఆస్పత్రి కానీ సదుపాయాలు కరువయ్యాయని అన్నారు.పేషెంట్స్కుగాని, ఔట్ పేషెంట్స్ని కనీస సౌకర్యాలు లేక పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతి విభాగంలో వుండాల్సిన డాక్టర్లు లేక ఒకరిద్దరూ డాక్టర్లచే నెట్టుకొస్తున్నారని దీనివలన రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.చిన్న చిన్న చికిత్సలు కూడా చేయకుండా వచ్చిన బాధితులను మహబూబ్నగర్, హైదరాబాద్లకు రెఫర్ చేస్తున్నారని పేషెంట్స్, పేషెంట్స్ బంధువులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు, బెంచీలు కరువయ్యాయని, త్రాగునీటి సమస్య ఉన్నదని అన్నారు. ఆసుపత్రిలోని సమస్యలపట్ల ప్రజా ప్రతినిధులు కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వున్నందున సమస్యలు జటిలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ బి సి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం ,జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏ. సీతారాములు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, ఓబిసి మోర్చా జిల్లా నాయకులు ఓం ప్రకాష్ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి రాయన్న సాగర్, బక్క శీను, ఎస్సీ మోర్చా నాయకులు నరసింహ, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల్లలో మొదలైన ప్లాస్టిక్ వస్తువుల నిషేధం



**అచ్చంపేట జులై 1 (చైతన్య గళం):** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల్ల అటవీ ప్రాంతంలోని వటవర్లపల్లి, దోమలపెంట ,మన్ననూరు గ్రామాలలో హెూటల్స్ మాల్స్ దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులను నిషేదించాలని వివిధ వ్యాపార సముదాయాల్లో ఫారెస్ట్ అధికారుల అవగాహన

# కళాశాలను ఏర్పాటు చేయాలని వినతి



**వెల్దండ జూలై 1 (చైతన్య గళం):** వెల్దండ మండల పరిధిలోని నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేయాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తాసిల్దార్ రవికుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ మండలంలో నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు అనువైన స్థలం ఉందని, కళాశాల ఏర్పాటుతో నిరుద్యోగ యువతీ యువకులకు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందనీ, నాగర్ కర్నూల్-రంగారెడ్డి జిల్లాలకు సరిహద్దుగా,చుట్టు ప్రక్కల మండలాలకు కూడా కేంద్రంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో అన్ని వర్గాల విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని, అనుకూలంగా ఉన్న చోటా నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేసే విధంగా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శేఖర్ రెడ్డి, బిజెపి జిల్లా స్పోక్స్ పర్సన్ రామస్వామి, బాలస్వామి జంగయ్య యాదవ్, శ్రీశైలం, శ్రీనివాస చారి తదితరులున్నారు.

# ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**వెల్దండ జూలై 1 (చైతన్య గళం):** వెల్దండ మండలం పరిది లో బొల్లంపల్లి గ్రామానికి చెందిన పోలే జంగయ్య ఇటీవల ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న గౌరవ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జంగయ్య నివాసానికి వెళ్లి పరామర్శించి 5,000/- ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంటే వెల్దండ మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, జక్కుల జంగయ్య, వెంకట్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రమును తనిఖీ చేసిన జిల్లా సమన్వయకర్త



**వనపర్తి జులై 1 (చైతన్య గళం):** వనపర్తి జిల్లాకేంద్రం లోని భవిత కేంద్రంను జిల్లా సమన్వయకర్త యుగంధర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త యుగంధర్ భవిత కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించి ఈ సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని, ఫిజియోథెరపీ ,స్పీచ్ థెరపీ క్యాంపుకు హాజరైన విద్యార్థుల వివరాలు, భవిత పిల్లల ఎన్రోల్మెంట్ పెంచాలని, ఇంటివద్ద విద్య కార్యక్రమాన్ని కొనసాగించాలని అన్నారు. జిల్లాలోని ప్రతి భవిత కేంద్రంలో పిల్లల యొక్క ప్రొఫైల్, IEP లను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రంలో గల పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో IERP లు ఉదయ్, ఉమ పాల్గొన్నారు.

# వైద్యులు పోషించే పాత్ర అద్వితీయం

**-మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్**
**-వనపర్తి లోని పలువురు వైద్యులకు సన్మానం**



**వనపర్తి జులై 1 (చైతన్య గళం):** దేశ ప్రజల కోసం లక్షలాది మంది డాక్టర్లు, ఆసుపత్రులు అందిస్తున్న నిరంతర సేవలకు గుర్తింపు, గౌరవ సూచకంగా నేషనల్ డాక్టర్స్ డే జులై 1న జరుపుకుంటున్నామని వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు.డాక్టర్స్ డే సందర్భంగా జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలోని డాక్టర్ బాలకిష్టయ్య విగ్రహానికి నివాళులు అర్పించి వనపర్తి పట్టణంలోని పలువురు వైద్యులను వాకిటి శ్రీధర్ సన్మానించారు.ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 1991 నుంచి ఏటా జులై 1న నేషనల్ డాక్టర్స్ డే నిర్వహిస్తోందని పేదల వైద్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ ఫిజీషియన్, పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి జులై 1 కావడంతో ఆయన జ్ఞాపకార్థం ఈ రోజును నేషనల్ డాక్టర్స్ డేగా పాటిస్తోందని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీకి స్నేహితుడైన డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్.. ఆయనకు వ్యక్తిగత వైద్యుడిగానూ వ్యవహరించారు. కేంద్రం ఆయన్ను 1961లో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించింది. వైద్య వృత్తికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకోవడంతోపాటు వృత్తి నిబద్ధత, వైద్య రంగంలో మానవతా విలువల పెంపు కోసం నేషనల్ డాక్టర్స్ డే ను కేంద్రం అమలు చేస్తోందని వాకిటి శ్రీధర్ వివరించారు

# పర్యావరణ పరిరక్షణ కోసం పాదయాత్ర చేస్తున్న కృష్ణ సాగర్ ను సన్మానించిన మాజీ మంత్రి

**-సంఘీభావంగా మొక్క నాటిన మాజీ మంత్రి**



**కొత్తూరు జులై 1 (చైతన్య గళం):** వాతావరణ కాలుష్య నివారణకు సమాజములో ఉన్న రుగ్మతలను మూఢ నమ్మకాలు పారద్రోలాలని,జంతువులను ప్రేమించాలని అలంపూర్ నుండి హైదారాబాద్ వరకు పాదయాత్ర చేస్తున్న చీర్ల కృష్ణ సాగర్ ను కొత్తూరు దగ్గర మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కలుసుకొని ఘనంగా సన్మానించారు.కృష్ణ సాగర్ పాదయాత్రకు సంఘీభావంగా రోడ్డు పక్కన ఒక మొక్క నాటారు.కృష్ణ సాగర్ పాదయాత్ర దిగ్విజయం కావాలని కోరారు.

# స్కూల్ బ్యాగుల పంపిణీ



**కుత్బుల్లాపూర్ 1, జూలై(చైతన్యగళం):** గాజులరామారం డివిజన్ కైసర్ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిజెపి నాయకులు రిటైర్డ్ ఎస్సై గోవర్ధన్ వారి కుమారులు హర్షవర్ధన్ తన వంతు సహాయంగా 60 మంది పిల్లలకు స్కూల్ బ్యాగ్స్ సహాయం చేయడం జరిగింది. ఈ బ్యాగ్స్ పంపిణీకి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ మల్లారెడ్డిమరియు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత,జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానీ ఈశ్వర్,డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్,ఐటీ సెల్ నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్స్ డే సందర్భంగా పలువురు డాక్టర్లను సన్మానించిన మాజీ మంత్రి

**-ప్రజా డాక్టర్ బాలకిష్టయ్య కు బిఆర్ఎస్ ఘన నివాళి**

వనపర్తి జులై 1 (చైతన్య గళం): డాక్టర్స్ దే సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పలువురు డాక్టర్లను ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు ప్రజావైద్యశాల వైద్యులు డాక్టర్.మురళీధర్, శారదలను మరియు అక్కడ పనిచేసే వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందింంచడములో ప్రత్యక్ష దైవాలుగా డాక్టర్స్ వుంటారని రోగులకు ఆత్మవిశ్వాసం నింపి వారి ఆరోగ్యాన్ని బాగుచేసి సమాజ సేవకు అంకితం అవుతారని అటువంటి డాక్టర్స్ కు సమాజంలో ప్రత్యేక



స్థానం ఉంది అని కొనియాడారు. వైద్యసేవలు అందుబాటులో లేని కాలములో ప్రజా డాక్టర్ గా నియోజకవర్గంలో విశేష సేవలు అందించిన డాక్టర్. బాలకష్టయ్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ ను ఘనంగా సన్మానించిన నిరంజన్ రెడ్డిపదవీ విరమణ చేసిన జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ యుగంధర్ రెడ్డి శ్రీదేవి దపతులను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో సన్మానించారు పదవీ విరమణ అనంతరం సమాజ సేవకు అంకితం కావాలి అని ఆకాంక్షించారు నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్, వాకిటి. శ్రీధర్, నందిమల్ల. అశోక్,నాగన్న యాదవ్, జాత్రా నాయక్,తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి,సయ్యద్. జమేళ్,ఫజల్, నందిమల్ల. రమేష్, నీలస్వామి, మురళీ సాగర్,మహేశ్వర్ రెడ్డి,ప్రేమ్ కుమార్, ప్రభాకర్, చిట్యాల. రాము,తోట. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సి.ఐగా బాధ్యతలు స్వీకరించిన భరత్ కుమార్



కుత్బుల్లాపూర్ 1, జూలై(చైతన్య గళం) సూరారం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా యస్. భరత్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు,సూరారం పి. యస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్. ఐలతో సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తదితర విషయాలపై సమీక్షించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల విషయంలో అలసత్వం వహించవద్దు అని ఆయన సూచించారు.

## యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

**-ఎమ్మెల్యే కృష్ణారావు**



కూకట్‌పల్లి 1, జూలై (చైతన్యగళం): బాలకృష్ణనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వి1స్పోర్ట్స్ అండ్ కేఫ్‌లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనా రాయణరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటితరం యువత సెల్‌ఫోన్‌కు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా మాయలోపడి విలువైన సమయాన్ని పాడు చేసుకోవద్దని హితవు పలికారు. క్రీడలలో నైపుణ్యాలను పెంపొందించుకుని రాష్ట్రానికి, దేశానికి సేవలందించాలన్నారు. క్రీడలతో మానసిక ఆరోగ్యంతో పాటు దేహ ధారుద్యం మెరుగవుతుందన్నారు. గత ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో దేవానంద్, వెంకటేష్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, అంబాటి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం 1, జూలై (చైతన్యగళం): ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని చర్ల పటేల్ గూడ, తుర్కగూడ, కప్ప పహాడ్ గ్రామాలలో ఎన్ ఆర్ జి ఎస్ నిధులు సుమారు 47.5 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, సమస్యలు లేని గ్రామాలుగా తయారు చేయాలని అధికారులకు ఆదేశించడం జరిగింది... ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, జడ్పీటీసీ మహిపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలక మధుసూదన్ రెడ్డి, ఈ సి శేఖర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఎద్దుల పాండురంగ రెడ్డి, గురునాథ్ రెడ్డి, జడల రవీందర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ ఉప సర్పంచ్ నరేందర్, మునీర్, ఎంపీటీసీ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ 1, జూలై(చైతన్యగళం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపాలిటీ పరిధి మల్లంపేట్ 26వ వార్డులోని కెవీఆర్ వ్యాలీ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని నాణ్యతలో రాజీ పడొద్దు అని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, పి.ఎన్.బి కాలనీ ప్రెసిడెంట్ లక్ష్మా రెడ్డి, కాలనీ సభ్యులు సురేష్, లక్ష్మి నారాయణ, సునీల్ కుమార్, ఉదయ్, కృష్ణా రావు, మహేష్, వెంకట్, దినాకర్, కిరణ్ రెడ్డి, ప్రభాకర్, బాలాజీ, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజాసేవ పురస్కారాలు

**-ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సేవలు అమోఘమైనవి అని కొనియడిన - స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి.**

**-ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసి ఉప్పల ట్రస్ట్ ద్వారా పురస్కారం పొందడం గొప్ప విషయం అని కొనియడిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్.**

**-జీవితకాలమంతా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాను - ఉప్పల వెంకటేష్.**



ఆమనగల్లు 1, జూలై (చైతన్యగళం): కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ పట్టణంలో శ్రీ లక్ష్మీ గార్డెన్స్ లో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గం లోని జడ్పిటిసిలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు అందరికీ ప్రజా సేవ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి గారు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారితో పాటు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులకు ఈ నెల నాలుగు తేదీతో వాళ్ళ పదవీకాలం పూర్తి కావస్తుండడంతో వారి గౌరవార్థం అందరికీ శాలువా, పూలదండ ,మెమొంటోతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సన్మానం చేశారు.

## ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు



కుత్బుల్లాపూర్ 1, జూలై(చైతన్యగళం): వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) ను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగద్గిరిగుటద్ట లోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్లు కొలుకుల జగన్,మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కార్పొరేటర్ చేతుల మీదుగా కేక్ కట్ చేపించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. వైద్యులను దేవునితో సమానంగా చూడడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఎల్లవేళలా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆర్.ఎం.పి ,పి.ఎం.పి డాక్టర్ల కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు విష్ణువర్ధన్,రవికుమార్,రాము,శోభన్ బాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమల్ల రిజర్వ్ ప్రాజెక్టులో ప్లాస్టిక్ నిషేధం



అచ్చంపేట జూలై 1 (చైతన్య గళం): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుండి అమరాబాద్ నల్లమల్ల టైగర్ రిజర్వ్ ప్రాజెక్టులో ప్లాస్టిక్ రహిత జోన్ ప్రకటించిన ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేస్తున్నామని అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మన్ననూరు, వటువర్ల పల్లి, దోమల పెంట ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిన అధికారులు పగడ్బందీగా అమలు చేసేందుకు గాను ఆయా గ్రామాల్లోని హోటలను, వ్యాపార సముదాయాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్లాస్టిక్ వాటర్ బాటిల్లను కవర్లను సేకరించారు. గత కొన్ని నెలలుగా ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం గురించి నూగానపరచడం జరిగిందని నేటి నుండి ప్లాస్టిక్ వస్తువులను విక్రయించిన జరిమానాల విధించడంతోపాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం




యాచారం 1, జూలై (చైతన్యగళం): మేడిపల్లి నక్కర్త ఉన్నత పాఠశాల 1990-1991 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్ లో సింధూర హోటల్ లో జరిగింది. విద్యార్థులంత ఒకచోట కలుసుకొని ఆనందంగా గడిపారు 1990-1991 పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నాటి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు . ఈసందర్భంగా MD. ఖాజాకుతుబద్దీన్మాట్లాడుతూ 34సంవత్సరాల తర్వాత ఒకే వేదిక పై కలుసుకోవడం చాల సంతోషంగా ఉందని అన్నారు.వారి కుటుంబాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. వారు చదువుకున్న చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎవరికి ఆపద వచ్చిన అందరం ఐక్యతతో అండగా నిలబడుతామని రామచంద్రయ్య , మల్లేష్ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు MD ఖాజాకుతుబద్దీన్, కందుకూరి రామచంద్రయ్య, తహేరంబేగం, V. మాధురి రెడ్డి,K. భాస్కర్ , తలరి మలేష్, బండారు హరికిషన్, V. మహేష్, GP,వెంకట్ రెడ్డి, పాలోజు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# కొంచెం మోదం కొంచెం ఖేదం







**-ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయి నుండి జడ్పిటిసిగా పోటీకి దారి తీసిన పరిణామాలు మరియు నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ గా ఐదు సంవత్సరాల ప్రజా జీవితంలో సాధించిన ప్రగతి,అనుభవాలపై చైతన్యగలం ప్రతినిధితో ప్రత్యేక ఇంటర్వ్యూలో ముచ్చటించిన ఠాకూర్ బాలాజీ సింగ్.**

**-స్థానిక సంస్థలపై గత ప్రభుత్వం అవలంబించిన వైఖరి పై పెదవి విరుపు.**

**-తెలంగాణ ఉద్యమం కోసం మరియు ప్రజలకు సేవ చేయాలి అనే ఉద్దేశంతో సింగపూర్,కెనడా వంటి దేశాల గ్రీన్ కార్డులను సైతం వదులుకున్న వైనం.**

**-రాజకీయ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారా ! లేక గత ప్రభుత్వంలో వలె ఇక్కడ కూడా సామాజిక సమీకరణాల ఊబిలో చిక్కుకుంటారా**

**-స్థానిక సంస్థల సభ్యులకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి**

**-గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేల మితిమీరిన జోక్యం వల్ల జడ్పీ సమావేశాల్లో ప్రజా సమస్యలు చర్చకు రాలేదు అంటున్న బాలాజీ**

**-రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధి తధ్యం**

**-నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ గా సాధించిన విజయాలు మరియు ప్రజా జీవితం గురించి బాలాజీ సింగ్ మాటల్లో.**

**హైదరాబాద్ 1, జూలై (చైతన్యగళం):** నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ గా జూలై 4తో పదవీకాలం ముగిస్తున్న నేపథ్యంలో చైతన్య గళం దినపత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఠాకూర్ బాలాజీసింగ్ మనసు విప్పి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినప్పటి నుండి ఈరోజు వరకు ఎదురైన అనుభవాలు తెలియజేశారు.వ్యాపార రీత్యా విదేశాల్లో స్థిరపడ్డా తెలంగాణ మలిదశ ఉద్యమం నేపథ్యంలో కెనడా,సింగపూర్లో తనకు,తన కుటుంబ సభ్యులకు ఉన్న గ్రీన్ కార్డులను సైతం రద్దు చేసుకొని తనకు ఉన్న కంపెనీ మరియు ఇల్లువిక్రయించి మరీ తెలంగాణ ఉద్యమంలో నేను సైతం అంటూ స్వదేశానికి వచ్చి కేసీఆర్ పిలుపుమేరకు నాటి టిఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్రమంతా తెలంగాణ ఉద్యమ ఉధృతంగా సాగుతుంటే ఉమ్మడి పాలమూరులో మాత్రం అప్పుడప్పుడే ఉద్యమం ఊపందుకుంటుంది.అలాంటి సమయంలో కల్వకుర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా టిఆర్ఎస్ పార్టీ తరఫున బాధ్యతలు స్వీకరించిన బాలాజీసింగ్ ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని పరుగులు పెట్టించారు.గ్రామాల్లో తండాల్లో పర్యటించి టిఆర్ఎస్ జండా గ్రామాలకు పరిచయం చేశారు.అంతేకాకుండా యువతలో ఉద్యమస్ఫూర్తిని నింపి తెలంగాణ ఆవశ్యకతని ప్రజలకు వివరించి తెలంగాణ సమాజాన్ని జాగృత పరిచే అనేక కార్యక్రమాలు నిర్వహించారు.ఉద్యమం కోసం భూములు,ఆస్తులని సైతం విక్రయించారు. ఉమ్మడి పాలమూరులో ఉద్యమానికి ఒక ఊపు తీసుకొచ్చారు తెలంగాణ ఉద్యమం అనంతరం 2014లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు నుండి బాలాజీ సింగ్ కల్వకుర్తి ఎమ్మెల్యేగా 80 నుండి 90 వేల కోట్ల మెజారిటీతో గెలుపొందుతారు అని అనేక బహిరంగ సభల్లో కేసీఆర్ ప్రకటించారు.అంతేకాకుండా జిల్లా నుండి మొదటి ఎమ్మెల్యే టికెట్ బాలాజీకే అని కూడా ప్రకటించారు.అలాంటి తెలంగాణ కల సహకారమైన తరువాత హఠాత్తుగా టికెట్ని జైపాల్ యాదవ్ కి కేటాయించడానికి కారణాలు తదనంతర పరిణామాలు ఆయన వివరించారు.సిట్టింగ్ ఎమ్మెల్యే హోదాలో తెలుగుదేశం నుండి టిఆర్ఎస్ లో చేరిన జైపాల్ యాదవ్ కి టికెట్ కేటాయించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది అని కేసిఆర్ బాలాజీ సింగ్ ను ఒప్పించి టికెట్ని జైపాల్ యాదవ్ కి కేటాయించారు. దానికి తాను అంగీకరించినప్పటికీ జైపాల్ యాదవ్ తాను బాలాజీ సింగ్ కి డబ్బులు ఇవ్వడంతో టికెట్ ఇవ్వడానికి అంగీకరించాడని దుష్ప్రచారానికి తెరతీశారు తప్పనిసరి పరిస్థితిల్లో ఇండిపెండెంట్గా పోటీ చేయాల్సి వచ్చింది అని తాను పోటీల్లో ఉన్నందున జైపాల్ యాదవ్ ఐదవ స్థానానికి పరిమితమయ్యారని బాలాజీ తెలిపారు అనంతరం 2014 ఎన్నికల్లో విజయం సాధించిన కెసిఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ముఖ్యమంత్రి హోదాల్లో సింగపూర్లో పర్యటించిన సమయంలో బాలాజీ సింగ్ పిలిపించుకొని ఖచ్చితంగా పార్టీకి పనిచేయాలని,ప్రభుత్వంలో భాగస్వామి కావాలి అని పార్టీని ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని బాలాజీ సింగ్ కోరారు దీంతో బాలాజీసింగ్ తిరిగి టీఆర్ఎస్ కు కండువా కప్పుకున్నారు.2014 నుండి 2018 వరకు బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన జిల్లాల పునర్విభజన తరువాత ఆర్డిఓ డివిజన్ ఏర్పాటు జరిగింది కానీ కల్వకుర్తికి మాత్రం మొండి చేయి చూపారు నాటి పాలకులు దీంతో ఆర్డిఓ ఆర్డిఓ డివిజన్ సాధనే లక్ష్యంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో జే ఏ సి ఏర్పాటు జరిగింది. కల్వకుర్తి ప్రాంతంలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది.ఆ సమయంలో బాలాజీసింగ్ ప్రభుత్వం పై ఒత్తిడి పెంచే క్రమంలో రెండు రోజుల్లో ఆర్డీవో జీవితం డివిజన్ ప్రకటించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు వెంటనే స్పందించిన మంత్రులు కెసిఆర్ కి విషయం తెలియజేయడంతో ప్రభుత్వం నుండి సానుకూల ప్రకటన వచ్చి తక్షణం బాలాజీసింగ్ నాయిని నర్సింహారెడ్డి కమిటీని కలిసి వారికి సమస్యను వివరించాలని సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని హైకమాండ్ సూచించింది వెంటనే వెంటనే కమిటీని కలిసి సమస్యను వివరంగా చెప్పగా స్పందించిన ప్రభుత్వం ఆర్డిఓ డివిజన్ ని ప్రకటించింది అని తెలిసిన విషయమే. ఈ సందర్భంగా సంఘటనలని ఆయన గుర్తుచేశారు. కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి కేటీఆర్ ని ఒప్పించి 15 కోట్ల రూపాయల ప్రత్యేక సాధించిన తీరుని బాలాజీ సింగ్ వివరించారు. ఇలా అభివృద్ధిలో కల్వకుర్తిని పట్టాలెక్కించిన బాలాజీ సింగ్ కి 2018 లో టికెట్ తధ్యం అనుకున్న సమయంలో కేసీఆర్ మరియు కేటీఆర్ బాలాజీని బుజ్జగించి జెడ్పీ చైర్మన్ హామీ ఇచ్చి జైపాల్ యాదవ్ కి తిరిగి టికెట్ ఇచ్చి గెలుపు బాధ్యతని బాలాజీ భుజస్కందాలపై పెట్టారని దీంతో కల్వకుర్తి నలుమూలల సుడిగాలి పర్యటనలు చేసి శ్రమించి జైపాల్ యాదవ్ ని విజయతీరాలకు చేర్చినట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వంలోకి రాగానే జడ్పీ చైర్మన్ హామీని కేసీఆర్ తుంగలో తొక్కినట్టు బాలాజీసింగ్ గుర్తు చేశారు.రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో జడ్పీ వైస్ చైర్మన్ తో సరిపెట్టారని దానికి కూడా జైపాల్ యాదవ్ అడుగడుగునా అడ్డు పడుతూ జెడ్పిటిసిగా పోటీ చేసేందుకు రిజర్వేషన్లు ఎక్కడ అనుకూలంగా లేకుండా చేశారుదీంతో చారకొండకు మారాల్సి వచ్చింది అని చారకొండ ప్రజల ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనని జడ్పిటిసిగా పోటీ చేసిన తనకి 68% ఓట్లతో తనను గెలిపించారని బాలాజీ సింగ్ తెలిపారు. జడ్పీ వైస్ చైర్మన్గా తనకు అవకాశం రావడంతో తన పరిధిలోని నిధుల అగ్ర భాగం కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల అభివృద్ధికి పూర్తిగా సహకరించానని తెలిపారు.ఈ కాలంలో తనపై కేసులు నమోదుకు జైపాల్ యాదవ్ విశ్వప్రయత్నాలు చేశారని తన అనుచరులను జైలుపాలు చేశారని తనను కూడా అనేక ఇబ్బందులకు గురి చేశారని అధిష్టానం పై గౌరవంతో అన్ని భరించారని బాలాజీ సింగ్ చెప్పుకోచ్చారు.కొత్త జిల్లా కావడంతో మొదట జిల్లా పరిషత్ భవనం కూడా లేదు ఎక్కడో చెరువులో ఒక తాత్కాలిక భవనంలో ఆరు నెలలు వెలదీసినట్టు ఎస్సీ రిజర్వ్ జడ్పీ కావడంతో అప్పటి ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపించింది అని మంత్రి నిరంజన్ రెడ్డి ద్వారా పంచాయతీరాజ్ కార్యాలయంలో ఒక ఫ్లోర్ కేటాయించాలి అని ఎన్నిసార్లు కోరిన సదరు మంత్రి స్పందించకపోవడం లాంటి విషయాలను చైతన్య గళం ఇంటర్వ్యూలో తెలిపారు. దాదాపు సంవత్సరం పోరాటం చేసిన తర్వాత తమకు కార్యాలయం కేటాయించారని జిల్లా పరిషత్ నిధులతో జిల్లా అభివృద్ధిలో భాగం అవ్వాలి అనుకున్న నిధులలేమి తో నిస్సహాయులుగా ఉన్నామని ఆయన తెలిపార. పేరుకే అధికార పార్టీ అని కెసిఆర్ పాలనతో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ఆయన వాపోయారు.ఎలాంటి అధికారాలు లేని అధికారిగా పార్టీగా మాత్రమే టిఆర్ఎస్ గెలిచిందని ఆయన ఎద్దేవా చేశారు.కేసీఆర్ పాలనలో స్థానిక సంస్థల గొంతు నొక్కారని ఆ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకి ఎంతో చేయాలి అనుకున్న కూడా నాటి ప్రభుత్వ వైఖరితో పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని ఆయన అన్నారు. కాగా కొన్ని కారణాలతో జడ్పీ చైర్మన్ తో ఒక నెల రోజులపాటు ఇన్చార్జి జెడ్పీ చైర్మన్గా సైతం బాలాజీ సింగ్ సేవలందించారు. జెడ్పీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించాలి అనుకుంటే నాటి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు,ఎంపీలు జోక్యంతో జడ్పిటిసిల గొంతులను నొక్కారని ఆయన వాపోయారు.ప్రభుత్వం ఓటెద్దు పోకడలతో కేసీఆర్ నియంతృత్వ వైఖరి మరియు జైపాల్ యాదవ్ కక్ష సాధింపు చర్యల కారంగా టిఆర్ఎస్కు రాజీనామా చేసి బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పదవితో గౌరవించింది అని ఎట్టి పరిస్థితుల్లో నియంత పాలన నుండి ప్రజలకు విముక్తి కలిగించాలి అని దృఢ నిశ్చయంతో పాలమూరు జిల్లా ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి నేతృత్వంలో జిల్లా మొత్తాన్ని స్వీప్ చేయడంలో మరియు ముఖ్యంగా కల్వకుర్తి,అచ్చంపేట నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేల విజయాల్లో కీలక భూమిక పోషించారు బాలాజీ.కెసిఆర్ తన అహంభావంతో చేజేతులా టిఆర్ఎస్ ని నాశనం చేసుకున్నాడని తెలంగాణలో ఆ పార్టీ కి స్థానం లేదు అనడానికి మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే ఉదాహరణ అని ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవడంతో పాటు 16% ఓట్ షేర్ కి టిఆర్ఎస్ పడిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన అందిస్తున్నామని తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది అని బాలాజీ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రిగా పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ ఉన్నారని ఆయన కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేటాయించారు ఇప్పటికే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కోసం భూ పరిశీలన కొనసాగుతుంది అని త్వరలో హైదరాబాద్-శ్రీశైలం రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది అని ఆయన గుర్తు చేశారు.కల్వకుర్తి ప్రాంతంలోని ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ని ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వాన్ని కోరుతామని బాలాజీసింగ్ తెలిపారు. కల్వకుర్తి ప్రాంత ప్రజల కోసం ప్రాంత అభివృద్ధి కోసం ఎంత దూరమైనా వెళ్తానని,ఏ త్యాగానికైనా సిద్ధమని ప్రజలకి 24 గంటలు అందుబాటులో ఉంటానని బాలాజీసింగ్ తెలిపారు.కల్వకుర్తి ప్రాంత అభివృద్ధి తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.గత ప్రభుత్వం నియంతృత్వ వైఖరి వల్ల స్థానిక సంస్థలు అస్తిత్వం కోల్పోయాయని రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని ఆయన పేర్కొన్నారు.జడ్పీలకు ఇచ్చే మినరల్ ఫండ్ని సైతం కేసీఆర్ ప్రభుత్వం పక్కదారి పట్టించింది అని దక్షిణ తెలంగాణని ఎడారిగా మార్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుంది అని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుని పూర్తిగా నిర్లక్ష్యం చేశాడని నిధులన్నీ కేవలం కాలేశ్వరం కోసం మాత్రమే కేటాయించారని కానీ కాసుల కక్కుర్తి ఇప్పుడు ప్రాజెక్టు ప్రశ్నార్థకమయ్యింది అని అన్నారు ఇక జెడ్పిటిసిగా వైస్ చైర్మన్ గా సంతృప్తి చెందారా అని ప్రశ్నించగా కేసీఆర్ ప్రభుత్వ అనాలోచిత నియంతృత్వ వైఖరి వల్ల అసంపూర్తి అసంతృప్తి గానే ఉంది అని నాటి ఎమ్మెల్యేలు ఎంపీల వైఖరితో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అభివృద్ధి కమిటీ నియామకమే చేపట్టలేదని గోకారం రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి కట్ట తెంపి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో అక్కడి ప్రజల జీవనం దెబ్బతింది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దృష్టికి గోకారం సమస్యను తీసుకెళ్లినట్టు రేవంత్ రెడ్డి గారు త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తారు అని ఆయన హామీ ఇచ్చారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల్లో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది అని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి గారు భూ నిర్వాసితుల నష్టపరిహారం బకాయిలు దాదాపుగా చెల్లించారని ఆయన తెలిపారు.కాగా మను చౌదరి ఐఏఎస్ సాకారంతో ప్రారంభించిన మన ఇసుక వాహనం కార్యక్రమం విజయవంతం అయ్యింది అని దానిని కూడా రాజకీయ జోక్యంతో ఇసుక దందాకి పథకం అడ్డుగా వస్తుంది అని అర్ధాంతరంగా నిలిపివేశారు దీంతో ప్రజలు కొంతమేర నష్టపోయారు అని ఆయన తెలిపారు.మొత్తానికి గత ప్రభుత్వ వైఖరితో ఐదు సంవత్సరాల పదవీకాలం కొంచెం మోదం-కొంచెం ఖేదం అన్నట్టు ఉంది అని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ తెలిపారు. కాగా 2028లో సార్వత్రిక ఎన్నికల బరిలో ఉంటారా అని ప్రశ్నించగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీ ఏ బాధ్యత ఇస్తే దాన్ని సమర్థంగా నిర్వహిస్తానని పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తానని బదులిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్దే తన లక్ష్యం అని మరోసారి పేర్కొన్నారు.